క్లుప్తంగా

నేడు వాసుబాబు పర్యటన

గణపవరం : ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మంగళవారం ఉదయం 10.30 గంటలకు పిప్పర గ్రామంలో జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. సాయంత్రం 4 గంటలకు నారాయణపురం సచివాలయం – 2 పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా 135వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకటరమణ

ఉంగుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ వెంకటరమణ ప్రారంభించారు. కార్యాలయం వద్దకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఏపీ రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం ఏర్పాటు చేశారన్నారు.

16న కౌన్సిల్ సమావేశం

ఉంగుటూరు : పశ్చిమగోదవరి జిల్లా ఏపీజీఏ ద్వితీయ కౌన్సిల్ సమావేశం ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు భీమవరం త్యాగరాజు భవనంలో నిర్వహిస్తున్నట్లు తాడేపల్లిగూడెం ఏరియా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వై.శేఖర్‌బాబు, వైవీ లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులకు కరపత్రాలు అందచేసి సమావేశానికి రావాలని ఆహ్వానించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కె.అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి రవీంద్ర, జీబీఆర్ఎస్ఎన్ అధ్యక్షుడు రాజు పాల్గొంటారని తాడేపల్లిగూడెం తాలూకా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు శేఖర్‌బాబు వివరించారు.

నేడు నారాయణపురంలో మా నమ్మకం నువ్వే జగన్

ఉంగుటూరు : నారాయణపురం సచివాలయ 2 పరిధిలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. అనంతరం 135 వరోజు గడపగడపకు కార్యక్రమం నిర్వహిస్తారని, ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారలు పాల్గొనాలని ఆయన కోరారు.

విశ్వబ్రాహ్మణుల శ్మశానవాటిక అభివృద్ధి



శ్మశానవాటికను అభివృద్ధి చేసిన దృశ్యం

పెదపాడు : పెదపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న విశ్వబ్రాహ్మణుల శ్మశానవాటికను సోమవారం అభివృద్ధి చేశారు. ఈ శ్మశానవాటిక పెద్ద గొయ్యిగా ఉండడం, ఈ ప్రాంతంలో చెత్త పడవేస్తుండడంతో విశ్వబ్రాహ్మణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. దీంతో పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తన సొంత నిధులతో శ్మశానవాటికను అభివృద్ధి చేయించారు. గొయ్యిలా ఉన్న ఆప్రాంతాన్ని మట్టితో నింపారు. దీంతో పాటు చుట్టూ ఫెన్సింగ్ వేసుకునేందుకు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు లక్కోజు సాంబశివరావు, గిరిజాల శ్రీనివాసాచారి, గిరిజాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

పెదపాడు : స్థానిక పెదపాడు మానవత శాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు సోమవారం పౌష్టికాహారం పొట్లాలను పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ చక్రవర్తి చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో సుమారు 80 మందికి ఆహార పొట్లాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

సహపంక్తి భోజనాలు

ఉంగుటూరు : బీజేపీ నిర్వహిస్తున్న సామాజిక న్యాయం కార్యక్రమంలో భాగంగా బొమ్మిడి దళితపేటలో సోమవారం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. అందులో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీ రాణి, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మజ పాల్గొని దళిత మహిళలు, వృద్ధులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కాకిలేటి వెంకటేశ్వరరావు, గడ్డం గుణసుందరి, పార్టీ మండల బీజేపీ అధ్యక్షులు వంజరపు దుర్గారావు, ఉపాధ్యక్షులు కొప్పల శ్రీనివాసు, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు అత్తింటి నాగేశ్వరి, యువమోర్చా మండల అధ్యక్షులు రవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్



గుండుగొలనులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలతో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



అర్జావారిగూడెంలో ప్రజాభిప్రాయం సేకరిస్తున్న సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్



చేబ్రోలులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి



సానిగూడెంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు), ఫ్రాన్సిస్



పోతునూరులో కరపత్రాలను అందజేస్తున్న సర్పంచ్ బోదుల స్వరూప్, నేతలు



భోగాపురంలో డోర్ స్టిక్కర్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



విజయరాయిలో ప్రజాభిప్రాయం నమోదు చేసుకుంటున్న వైఎస్సార్ సీపీ నేతలు

భీమడోలు : బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలు, అభివృద్ధి అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గుండుగొలనులో సోమవారం రాత్రి ఎమ్మెల్యే వాసుబాబు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. తొలుత గ్రామంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు బాణసంచా కాల్చుతూ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలకగా, మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా వాసుబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ పాలన, సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి వచ్చే సమాధానాలను పుస్తకంలో నమోదు చేశారు. సంక్షేమ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ వచ్చే ఎన్నికల్లో జగన్ బాబునే సీఎం చేస్తామని, మా కుటుంబాలకు వెలుగులు నింపిన జగనన్నకు తామంతా రుణపడి ఉంటామని ముక్తకంఠంతో తెలిపారు. వారి సమ్మతితో ఇళ్లపై జగనన్న స్టిక్కర్లు అతికించారు. సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కూర్మా లక్ష్మీరాజ్‌కుమార్, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్, తహసీల్దార్ షంషూద్దీన్, వైస్ ఎంపీపీ డోకల వాసంతి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువూరి సత్యనారాయణరాజు, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జహీర్, నాయకులు పిప్పర సుబ్బరాజు, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీలు నత్తా నాగిని, వెంకటేశ్వరమ్మ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ మద్దుల రాజా, సీనియర్ నాయకులు గొటికల మురళీ, నల్ల శంకర్, నల్ల శ్రీను, వేములమంద రామరాజు, బొబ్బిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి

భీమడోలు : భీమడోలు పంచాయతీ శివారు అర్జావారిగూడెంలో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ ప్రారంభించారు. రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, వార్డు సభ్యులు బురకాయల కిరణ్‌లతో కలిసి ఆమె గ్రామంలోని ఇంటింటికీ వెళ్లారు. నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనపై అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై పార్టీ విడుదల చేసిన ఐదు ప్రశ్నలను లబ్ధిదారులను అడిగి వారి అభిప్రాయాలను నమోదు చేశారు. వారి సమ్మతితో వారి ఇంటి డోర్లపై స్టిక్కర్లను అతికించారు. మళ్లీ జగనే రావాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్, గృహసారథులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : చేబ్రోలు గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి పార్టీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికి తిరిగారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు.

ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా

దెందులూరు : మండలంలోని గ్రామగ్రామాన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా సాగింది. వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని, సచివాలయాల దెందులూరు మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, సానిగూడెం వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షులు ఫ్రాన్సిస్, సర్పంచ్ రామకృష్ణ (విష్ణు), వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయరావు, రాంబాబు, రాజేష్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు సమ్మతితో ఇళ్లకు జగనన్న స్టిక్కర్‌ను వారి సమక్షంలో కామిరెడ్డి నాని అతికించారు. పలువురు టోల్‌ఫ్రీ నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తమ మద్దతు తెలిపారు. పోతునూరు, కేదవరంలో సర్పంచ్ బోదుల స్వరూప్, రేషన్ డీలర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు తలారి రామకృష్ణ, బుద్దా కృష్ణార్జున, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ నరేష్, పార్టీ కార్యదర్శి రమేష్ ఉన్నారు. దెందులూరులో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు పోకల రాంబాబు, మహిళా అధ్యక్షురాలు తొత్తడి వేదకుమారి, సచివాలయ మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, ఎంపీటీసీలు తోట విజయకుమారి, పులిపాటి ఆనంద్, తాళ్లూరి నాగరాజు, గృహసారధులు, వలంటీర్లు సర్వే నిర్వహించారు. కిట్లను అందచేశారు. జగనన్న స్టిక్కర్లను లబ్ధిదారులు తెలిపిన సమాధానంతో స్టిక్కర్లను అతికించారు. దోసపాడు, శ్రీరామవరం, గోపన్నపాలెం, జోగన్నపాలెంలో ప్రజాప్రతినిధులు వైఎస్సార్ సీపీ శ్రేణులు జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్

పెదవేగి : గ్రామాలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని సోమవారం పార్టీ శ్రేణులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మీకు జగనన్న ప్రభుత్వంలో లబ్ధి చేకూరిందా, ఇంకా మీరు ఏమి కావాలనుకుంటున్నారు అని అడిగి తెలుసుకున్నారు. నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో చంద్రబాబు ఎప్పుడూ హామీలు ఇచ్చినా, మోసం చేయడానికే కానీ, ఏనాడూ నెరవేర్చిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. బాబు ప్రవర్తనతో విసిగిపోయిన ప్రజలు నిన్ను నమ్మం బాబు అని బాబు పాలనకు గుడ్‌బై చెప్పి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేశారని, ఇచ్చిన మాట ప్రకారమే జగనన్న మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చారని తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, వలంటీర్లు, గృహసారధులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం



గుండుగొలనులో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

భీమడోలు : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గుండుగొలను గ్రామంలో రూ.3.6 కోట్లతో నూతనంగా మంజూరైన 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు సోమవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ గుండుగొలను, పరిసర గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోతునూరు సబ్‌స్టేషన్ నుంచి వచ్చే విద్యుత్ వినియోగం వల్ల లోడ్ పెరిగిపోవడంతో తరచుగా విద్యుత్ అంతరాయాలు ఏర్పడి ప్రజలతో పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కాక మంచినీటి ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటిన్నింటికి శాశ్వత పరిష్కారం కోసమే గత ఏడాది గుండుగొలనులో సబ్‌స్టేషన్ నిర్మించాలని ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించామన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేసిందని, ఇకపై విద్యుత్ కష్టాలు తీరతాయన్నారు. ఎస్ఈ పి.సాల్మన్‌రాజు మాట్లాడుతూ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏలతో పాటు నాలుగు ఫీడర్లు నిర్మిస్తామన్నారు. జీవీఎస్ ప్రాజెక్టుకు కాంట్రాక్ట్‌ను అప్పగించామన్నారు. త్వరితగతిన సబ్‌స్టేషన్ నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కూర్మా లక్ష్మీరాజ్‌కుమార్, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఈఈ టి.శశిధర్, ఈఈ(నిర్మాణవిభాగం) వెంకటేశ్వరరావు, డీఈఈ కె.గోపాలకృష్ణ, ఏఈ రామస్వామి, ఏఈ(నిర్మాణ విభాగం) యువరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువూరి సత్యనారాయణరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ క్యాలెండర్ ఘనత వైఎస్సార్ సీపీదే



కొక్కిరపాడులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు : సంక్షేమ పథకాల అమలు కోసం సంక్షేమ క్యాలండర్‌ను విడుదల చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలంలోని కొక్కిరపాడు గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి గడప గడపకూ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న కరెంటు మీటర్లు మా ఆధార్‌కు లింక్ అయినందున పింఛను రాలేదని, డ్రెయినేజీలు నిర్మించాలని, రహదారులు అభివృద్ధి చేయాలని కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖా అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ మరీదు రెడ్డియ్య, ఎంపీటీసీ వీరంకి బుజ్జి పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, నర్సాపురం నియోజక వర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి రాకుండా ప్రణాళిక

దెందులూరు : దెందులూరు నియోజకవర్గంలో ఏ గ్రామంలోనూ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళిక రూపొందించినట్లు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.గిరిబాబు, డివిజనల్ ఇంజనీర్ సీహెచ్ రమేష్, దెందులూరు ఏఈ ఎం.రాజేంద్రప్రసాద్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ అధికారులు ప్రస్తుత పరిస్థితి తెలుసుకుని ఏ గ్రామంలోని తాగునీటికి సంబంధించి సమస్య రాకుండా ముందస్తుగా మంచినీటి చెరువులు నింపుకోవాలన్నారు. పైపులైన్ లీకేజీలు, చెరువులు మరమ్మతులు, ఇతర సమస్యలు గుర్తించి యుద్ధప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలన్నారు. తాగునీటికి సంబంధించి ప్రజల నుంచి ఏ ఒక్క ఫిర్యాదు రాకుండా గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో సహాయ సహకారాలు అందించాలన్నారు. దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల్లోని చెరువులు, పైపులైన్లు, ట్యాప్‌లపై సమీక్షించారు. కొవ్వలి సీపీడబ్ల్యూ స్కీం, చెరువు నింపడం, ఆ చెరువు ద్వారా 7 శివారు గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్న విషయాన్ని ప్రత్యేకంగా ఎమ్మెల్యే ప్రస్తావించారు. సమీక్షా సమావేశంలో ఎస్ఈ సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల పర్యటన చేసి సమస్యలను పరిష్కరించి అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. మరోసారి అధికారులతో సమావేశం నిర్వహించి వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమీక్షా సమావేశంలో వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, కొవ్వలి గ్రామ పార్టీ అధ్యక్షులు కాటి సుధాకర్ పాల్గొన్నారు.

ముగిసిన రాట్నాలమ్మ ఉత్సవాలు



శ్రీరాజరాజేశ్వరిదేవిగా దర్శనమిస్తున్న రాట్నాలమ్మ అమ్మవారు



అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : రాట్నాలకుంటలో శ్రీరాట్నాలమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు సోమవారం అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరి దేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజా, నవగ్రహ మండపార్చన, పరివార దేవతార్చన, శ్రీ అమ్మవారికి నిత్యార్చన, ఉత్సవపూజ, పుష్పాలంకరణ, సహస్రనామార్చనాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ శ్రీ రాట్నాలమ్మతల్లి ఉత్సవాల్లో భాగస్వామిగా ఉండడం తన అదృష్టమన్నారు. అమ్మవారి ఆలయాన్ని ఇంకా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. మధ్యాహ్నం 12 గంటలకు దీక్షా విరమణ, అమృతోత్సవం, కుంభాభిషేకం అనంతరం మహదాశీర్వచనం, సాయంత్రం 7 గంటలకు శ్రీ లక్ష్మీగణపతి రామాంజనేయ కోలాట బృందం చిన వెంకన్న శిష్యబృందం ఏలూరు వారిచే కోలాటం, రాత్రి 9 గంటలకు సినీ మ్యూజికల్ నైట్ అట్టహాసంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చళ్లగొళ్ళ వెంకటేశ్వరరావు, ధర్మకర్తలు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ

దెందులూరు : స్పందనలో రెండు ఫిర్యాదులపై సోమవారం దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య విచారణ నిర్వహించారు. పట్టాదారు పాసుపుస్తకం, సరిహద్దు సమస్యలపై స్పందనలో వచ్చిన ఫిర్యాదును పరిశీలించి ఇరువురిని విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. త్వరలోనే సమస్య పరిష్కారానికి పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట వీఆర్‌ఓలు కిషోర్, రామకృష్ణ ఉన్నారు.

మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



గణపవరంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ అలంకారం

గణపవరం : గణపవరం పట్టణ ప్రజల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని, ఎమ్మెల్యే వాసుబాబు కృషితో 5వ రక్షిత మంచినీటి సరఫరా పథకం మంజూరైనట్లు సర్పంచ్ మూర అలంకారం తెలిపారు. సోమవారం గణపవరం బాలుర హైస్కూల్ ఎదురుగా ఇటీవల అభివృద్ధి చేసిన ఎస్సీ పేట చెర్వు వద్ద నూతన మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో మంచినీటి సమస్య పరిష్కారానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని ఈ నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంకు, సంపు, మైక్రోఫిల్టర్‌లను నిర్మించి, పట్టణంలో 15 కిలోమీటర్ల మేర కొత్త పైపులైను నిర్మించనున్నట్లు తెలిపారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము మాట్లాడుతూ గణపవరంలో అన్ని ప్రాంతాలకు సరిపడ మంచినీరు సరఫరా చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మంచినీటి పథకం నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరనాథ్‌రాజు, పంచాయతీ కార్యదర్శి డీఎస్‌ఆర్ ప్రసాద్, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్‌జానీ, ఎంపీటీసీ బత్తి సీతామహాలక్ష్మి, సొసైటీ మాజీ అధ్యక్షుడు రుద్రరాజు సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ఖాదర్‌ఖాన్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ఆక్రమణలు తొలగించాలి



స్పందనలో వినతిపత్రం ఇస్తున్న రామలింగరాజు

గణపవరం: గణపవరం మండలం పిప్పర మూడురోడ్ల కూడలిలోని బస్టాండ్‌వద్ద ఆక్రమణలు తొలగించి, ప్రయాణికులకు వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు నంద్యాల రామలింగరాజు అన్నారు. ఈమేరకు సోమవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఎంపీడీవో గద్దల జ్యోతిర్మయికి వినతిపత్రం అందజేశారు. పిప్పర మూడురోడ్ల కూడలిలో వడ్డిగూడెం వైపు ఉన్న బస్టాండ్ వద్ద ఆక్రమణలు వెలిశాయని, దుకాణదారులు బస్టాండు ప్రాంతం ఆక్రమించడంతో మహిళలు, విద్యార్థినులు బస్టాండులోకి వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఇంతేకాకుండా బస్టాండులో కొందరు ఆకతాయిలు మద్యం సేవిస్తూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నారని దీనిపై తగు చర్యలు తీసుకుని బస్టాండులో వేచి ఉండే మహిళలు, విద్యార్థినులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

దోషులను వెంటనే అరెస్టు చేయాలి

దెందులూరు : నియోజకవర్గంలోని కొక్కిరాయిలంక గ్రామంలో దళిత వర్గానికి చెందిన ఉచ్చుల విజయభాస్కరరావును హత్య చేసిన, చేయించిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనికళ్ళ మురళీకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ముప్పవరంలోని కంద్రికనరసింహపురం గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కొక్కిరాయిలంక గ్రామానికి చెందిన పేద దళిత వర్గానికి చెందిన భాస్కరరావును అదే గ్రామంలో నివసిస్తున్న అగ్రవర్ణాలకు చెందిన కొందరు విజయ భాస్కరరావును హత్య చేశారన్నారు. హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశామన్నారు. దళిత సంఘం జాతీయ నేత అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ ఆధ్వర్యంలో మరోసారి మంగళవారం జిల్లా ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని మానవహక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మురళీ తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
దెందులూరు, ఉంగుటూరు
9912220559
90102 23729
63097 62918
Office mail : tpgadvt@gmail.com